## జంతర్ మంతర్‌లో జరిగే ధర్నా గోడ పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**కౌడిపల్లి, మార్చి 24, ప్రభాతవార్త:** తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 30, 31 వ తేదీలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఎస్సీ వర్గీకరణ, మహిళా బిల్లుకు చట్టబద్దత కల్పించాలని తలపెట్టిన ధర్నా గోడ ప్రతికను స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం నాడు ఎంపిడిఓ సమావేశ మందిరంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణ మాదిగ, జిల్లా అధ్యక్షులు దుర్గయ్యల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటరీ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ, మహిళా బిల్లులపై చర్చించి చట్ట బద్దత కల్పించి తీరాలని, లేని పక్షంలో జాతీయ స్థాయిలో ఉద్యమాలను నిర్వహించడానికి వెనకంజ వేయబోమని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమాని విజయ వంతం చేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సభ్యులు హాజర్ కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కౌడిపల్లి అధ్యక్షులు శేఖులు, కార్యదర్శి కుమార్, కొల్చారం అధ్యక్షులు మాదరి యేసు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## నేటి జనచైతన్య యాత్రను విజయవంతం చేయండి

**సిపిఐ(ఎం) జిల్లా నాయకురాలు బాలమణి**

**రామాయంపేట, మార్చి 24, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ(ఎం) పార్టీ చేపట్టిన జన చైతన్య యాత్ర విజయవంతం చేయాలని సిపిఐ(ఎం) జిల్లా నాయకురాలు బాలమణి అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జనచైతన్య యాత్ర నిజామాబాద్ నుండి బస్సు యాత్రగా బయలుదేరి శనివారం మెదక్ జిల్లా శివారు అయిన రామాయంపేట చేరుకుంటుందని తెలిపారు. ఈ బస్సు యాత్రలో పోలిట్‌బ్యూరో సభ్యులు విజయ రాఘవన్, బృందం సభ్యులు జాన్‌వెస్లీ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చుక్కా రాములుతో పాటు సిపిఐ(ఎం) పార్టీకి చెందిన పలువురు నాయకులు రానున్నారని ఆమె తెలిపారు. నేటి జనచైతన్య యాత్రను ప్రజాస్వామిక శక్తులు, ప్రజాప్రతినిధులు, సామాజిక శక్తులు, కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.



కంటి వెలుగు శిబిరంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

## కంటివెలుగు శిబిరాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**కొల్చారం, మార్చి 24 ప్రభాతవార్త:** కొల్చారం మండల వరిగుంతం గ్రామంలోని కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. కంటి పరీక్షలు నిర్వహిస్తున్న తీరును, రికార్డులను, అంద్దాల పంపిణీ రికార్డులను పరిశీలించి, వైద్యాధికారులతో శిబిరాల నిర్వహణ తీరును తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. నేటితో శిబిరం ముగియనున్నందున ఇంకా మిగిలిన వారందరికీ కంటి పరీక్షలు చేయించేలా ఆశావర్కర్లు, అంగన్వాడీలు, పంచాయితీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించి శిబిరానికి వచ్చేలా చూడాలన్నారు. అవసరమైనవారికి కంటి అద్దాలు, మందులు అందించడంతో పాటు వస్త్ర చికిత్సలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని రెండవ విడతగా చేపట్టిందని అన్నారు. జిల్లాలో 41 బృందాల ద్వారా అన్ని శాఖల సమన్వయంతో కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేస్తూ షామియానాలు, కుర్చీలు, మంచి నీటి సదుపాయం వంటి కల్పిస్తూ, ప్రజాప్రతినిధుల సహకారంతో శిబిరాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని, ప్రజల నుండి మంచి స్పందన వస్తుందని, దూరపు చూపుతో బాధపడుతున్న వారికి ఆర్డర్ ద్వారా ఇప్పటి వరకు 17 వేల కళ్లజోళ్లు తెప్పించి ప్రజాప్రతినిధులు, ఆశా వర్కర్ల ద్వారా అందించామని అన్నారు. దగ్గర చూపుతో బాధపడుతున్న వారికి కంటి పరీక్షల వెంటనే నాణ్యమైన కంటి అద్దాలు అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి సాయిబాబా, డాక్టర్ కిరణ్, మండల పరిషత్ అధికారి గణేష్‌రెడ్డి, జెడ్పీటీసీ, సర్పంచి తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు, సిబ్బంది పోటీపడి విధులు నిర్వహించాలి

**సిపి శ్వేత**



కొమురవెల్లి నూతన పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ శ్వేత

**కొమురవెల్లి, మార్చి 24, ప్రభాతవార్త :** విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది పోటీ పడి విధులు నిర్వహించాలని..అంకిత భావంతో విధులు నిర్వహించేవారికి రివార్డులు ప్రతి నెల ఇవ్వడం జరుగుతుందని సీపీ శ్వేత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను ఆమె సందర్శించారు. పోలీసు స్టేషన్‌లో ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి ఏ తరహాకేసులు ఎక్కువ నమోదువున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌లో ఉన్న రికార్డ్సు, 5ఎస్ ఇంప్లిమెంటేషన్ ఏ రోజుకారోజు క్రమం తప్ప కుండా చేయాలని ఎస్ఐ చంద్రమోహన్‌కు సూచించారు. వర్టిక్ వారిగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించి ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళాల అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకొని తక్షణ సేవలు అందించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి నేరాలరేటును తగ్గించాలన్నారు. నూతనంగా నిర్మిస్తున్న పోలీసు స్టేషన్‌ను సందర్శించి పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. అమె వెంట చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, కొమురవెల్లి ఎస్ఐ చంద్రమోహన్ ఉన్నారు.

## ప్రజలు మోడీకి తగిన గుణపాఠం చెప్తారు

**టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రబాతరావు**

**రామాయంపేట, మార్చి 24, ప్రభాతవార్త :** కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడం శోచనీయమని, మోడీ చర్యలను దేశ వ్యాప్తంగా ప్రజలు, మేధావులు, ప్రతిపక్ష పార్టీలు ఖండించాలని టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రబాతరావు అన్నారు. శుక్రవారం నాడు ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో పచ్చి నియంత ప్రధాని మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. అదాని, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ, దేశాన్ని అమ్ముకుంటూ, సిబిఐ, ఈడీలను జేబు సంస్థలుగా మార్చుకొని, ప్రభుత్వాలను పడగొడుతూ, పశిస్టు పాలనను నడుపుతున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి ప్రభుత్వానికి దేశ ప్రజలు బుద్ది చెప్పాలని ఆయన కోరారు.

## ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగి ఉంటేనే అభివృద్ధి సాధ్యం

**-ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి**

**కౌడిపల్లి, మార్చి 24, ప్రభాతవార్త:** ప్రజాప్రతినిధులు ఎంత ఎత్తుకు ఎదిగిన ఒదిగి ఉంటేనే గ్రామాభివృద్ధి సాధ్యమని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉత్తమ సర్పంచులకు అవార్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు సర్పంచులు గర్వం లేకుండా గ్రామ ప్రజలతో మమేకమై ఉంటే తప్పకుండా అభివృద్ధి సాధించడం సులభం అవుతుందన్నారు. కౌడిపల్లి మండలంలోని 29 పంచాయతీలతో పనిచేసిన కార్యదర్శిలతోపాటు సర్పంచులకు, ఎంపిటీసిలకు గ్రామ ఉత్తమ పంచాయతీ అవార్డులు పొందిన గ్రామాలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అవార్డులను పంపిణి చేశారు. నేడు మన ఊరు-మన బడి కింద పాఠశాలలను అభివృద్ధి పర్చి, విద్యార్థులకు మౌళిక సదూపాయాలను సమకూర్చడం జరుగుతుందని ఆయన గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే తోపాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ చంద్రాగౌడు, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్‌రెడ్డి, జేడ్పిటీసి కవితా అమర్ సింగ్ రాథోడు, ఎంపిపి రాజు నాయక్, ఎంపిడిఓ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీహరి, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపిటీసిలు, పంచాయతీ కార్యదర్శిలు, నాయకులు కాంతరావు, నాయికోటి శ్యాంసుందర్ రావు, తునికి ఆలయ కమిటి సభ్యులు సంతోష్ తదితరలు పాల్గొన్నారు.



ఉత్తమ పంచాయతీ అవార్డులను పొందిన రాయిలాపూర్ గ్రామ సర్పంచ్ కుర్మ శేఖులను సన్మానించిన ఎమ్మెల్యే

# డబుల్ ఇళ్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాం

**మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్**

**హుస్నాబాద్, మార్చి 24,ప్రభాతవార్త**

డబుల్ బెడ్‌రూం ఇండ్ల సర్వేను 3 విడతలుగా అత్యంత పారదర్శకంగా నిర్వహించామని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. శుక్రవారం రోజున హుస్నాబాద్ పురపాలక సంఘం 2023-24 సంవత్సరం సంవత్సర బడ్జెట్ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, కమిషనర్ రాజమల్లయ్యలు అధ్యక్షత వహించగా మున్సిపల్ అకౌంటెంట్ రేణుక కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుల సమక్షంలో బడ్జెట్ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుస్నాబాద్‌లో అక్రమంగా వెంచర్లు వెలుస్తున్నాయని అధికారులు వాటికి సంబందించిన టాక్స్ వసూలు చేయాలని సూచించారు. ప్రజల ఆరోగ్యానికి సంబందించి దుకాణ సమూదాయాల నుండి టాక్స్ ఎక్కువవసూళ్లు చేయడం సమంజసం కాదన్నారు. పట్టణంలో కుక్కలు, పందులు, కోతుల బెడద లేకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా డ్రైనేజీ వ్యవస్థను వెంటనే బాగు చేసుకోవాలని సూచించారు. కమిషనర్ రాజమల్లయ్య మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేదుకు కృసి చేస్తామన్నారు. కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ డబుల్‌బెడ్ రూంల ఎంపిక ప్రక్రియలో మూడు విడతలుగా నిర్వహించిన సర్వేల్లో అత్యంత పారదర్శకంగా నిర్వహించామని ఈ విషయంలో అర్హులకు అన్యాయం జరిగి తమవద్ద ఉన్న ఆదారాలతో వస్తే మళ్లీ విచారణ చేసి న్యాయం జరిగే విదంగా కృషిచేస్తామన్నారు. మున్సిపల్ అభివృద్దిలో ఎలాంటి సమస్య వచ్చినా సమస్య పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ పట్టణం పెరుగుతుందనడానికి ఉదాహరణీ జడెట్ అన్నారు. 1981 లక్షలకు బడ్జెట్ చేరడం హర్షించదగ్గ విషయమని, పట్టణంలో క్రమ బద్దీకరణ చాలా ముఖ్యం అని చైర్మెన్, కౌన్సిలర్లు పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ద పెట్టాలన్నారు. ఎల్కతుర్తి నుండి రామాయంపేట వరకు జాతీయ రహదారి పనులు ప్రారంభమయ్యాయని, తద్వార అంబేద్కర్ చౌరస్తా ఇతర రెండు చౌరస్తాలు పెద్ద మొత్తంలో అభివృద్ధి చెందుతాయన్నారు. పట్టణ అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని తాము చెల్లించాల్సిన పన్నులు సమయానికి చెల్లిస్తూ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. పట్టణంలో డబుల్ బెడ్‌రూం రానివాళ్లు నిరాశచెందవద్దని లబ్దిదారులకు ఇంటి స్థలం ఉంటే మూడు లక్షలు లేకపోతే జీవో 58,59 ద్వార స్థలాన్ని కూడా అందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన చేస్తున్నట్లు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్,ఎమ్మెల్యే

గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణ పనుల విషయంలో జిల్లా కలెక్టర్ సహకరించినందుకు ఆయనను అభినందించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయ పనులను ఎమ్మెల్యే, కలెక్టర్‌లు పరిశీలించి నిర్ణిత గడువు లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ముజామిల్ ఖాన్, వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సంజీవులు

## ఎస్సీలోని 59 ఉప కులాలకు దళితబంద్ అందించాలి

**కౌడిపల్లి, మార్చి 24, ప్రభాతవార్త:** గ్రామీణ స్థాయి నుండి ఢిల్లీ వరకు డాక్టర్ బిఆర అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్‌ల జయంతి. వర్ధింతిలను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని జాతీయ మాల మహానాడు జల్లా అధ్యక్షులు సంజీవులు పేర్కొన్నారు. శుక్రవారం నాడు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు ఎస్సీ జాబితాలో ఉన్న 59 ఉప కులాలకు సైతం తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న దళిత బంద్ పథకం నిష్పాక్షపాతకంగా అందరికి అందించితీరాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్యాలయాలతో పాటు గ్రామీణ స్థాయిలో అంబేద్కర్ జయంతి, వర్ధంతి ఉత్సవాలను అత్యాంత్య వైభవం జరిపించి తీరాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఈయన తోపాటు జాతీయ మాల మహానాడు మండల అధ్యక్షులు శివ, నర్సాపూర్ మండల అధ్యక్షులు యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్ నాయడు తదితరలు పాల్గొన్నారు.

## కనుల పండుగగా శ్రీరేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం

**కొల్చారం, మార్చి24 ప్రభాతవార్త:** కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో కన్నుల పండుగగా శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ కార్యక్రమం. మొక్కులు చెల్లించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు. కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలోని మంజీరా నది ఒడ్డున వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా శుక్రవారం శ్రీ రేణక ఎల్లమ్మ మహోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండుగగా వేద పండితుల మంత్రోత్సవాలతో నిర్వహించారు. కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మాధవి శ్రీశైలం, యువ నాయకుడు దొడ్ల, అఆయిల బాలమ్మ, రాములు దంపతులు పెళ్లి పెద్దలుగా పాల్గొని కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దొడ్ల ఆపర్ణ ఆంజనేయులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు రఘువీరారెడ్డి మండల అధ్యక్షులు పాతూరి దయాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రవీందర్, పశుపతి, దత్తురావు, దొడ్ల విశ్వపతి, హనుమప్ప, సిద్ధప్ప, కిష్టయ్య, మల్లేశం, గంగయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వామి వారి కళ్యాణం

**చిన్నశంకరంపేట, మార్చి 24, ప్రభాతవార్త:** మండల పరిధి గజగట్లపల్లి గ్రామంలో శుక్రవారం వేంకటేశ్వర స్వామి కళ్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో మాందాపూర్, మడూర్, శాలీపేట, వెంకట్‌రావుపల్లి, చెన్నాయిపల్లి, గవ్వలపల్లి తదితర గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారికి మొక్కులను చెల్లించుకున్నారు.



ఏపిఎం లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందిస్తున్న వివోఏలు

## సమస్యలు పరిష్కరించేవరకు విధులకు దూరం

**చిన్నశంకరంపేట, మార్చి 24, ప్రభాతవార్త:** ప్రభుత్వం వివోఏల సమస్యలను పరిష్కరించేంత వరకు విదులకు హాజరుకామని వీవోఏలు తెలిపారు. నాడు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల ఏపిఎం లక్ష్మీనారాయణ, అధ్యక్షురాలు కృపారుక్మిణిలకు శుక్రవారం నాడు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనంరూ.26వేలు ఇవ్వాలని, సెర్ప్ ద్వారా గుర్తింపు కార్డులను ఇవ్వాలని, వివోఏలకు భీమా సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకు నేటి నుండి విదులకు హాజరు కామని, వివిధ గ్రామాలకు చెందిన వీవోఏలు తెలిపారు. వీవోఏల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తిసుకెళ్తామని తెలిపారు.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి : సర్పంచ్

**అల్లాదుర్గం, మార్చి 24 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని అల్లాదుర్గం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు అంజి యాదవ్ ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కంటి వెలుగు శిబిరానికి హాజరై కంటి పరీక్షలు చేయించుకుంటే అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డాక్టర్ అశ్విని, ఎంపీటీసీ దశరథ్, గ్రామ వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, పంచాయితీ కార్యదర్శి సవిత, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితోనే పంచాయతీకి అవార్డు

**-సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్**

**ఝరాసంగం, మార్చి 24, ప్రభాతవార్త:**

గ్రామస్థుల, అధికారుల సమిష్టి కృషి ఫలితమే పంచాయితీకి దీన్ దయాళ్ ఉపాధ్యాయ సతత్ వికాస పురస్కారం వచ్చిందని మండలంలోని మేదపల్లి సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్ పట్టణంలోని ఫ్రెండ్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మండలంలోని ఆయా గ్రామాల పంచాయితీ సర్పంచ్‌లకు అవార్డులు అందచేశారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న సర్పంచ్ పరమేశ్వర్‌పాటిల్ మాట్లాడుతూ పంచాయితీ కార్యదర్శి కాంచన రాథోడ్ కృషి ఆమోఘమన్నారు. గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు గ్రామాభివృద్దికి అందిస్తున్న సహకారం ఎనలేనిదాగా ఉందన్నారు. గ్రామాభివృద్దికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని సర్పంచ్ పరమేశ్వర్‌పాటిల్ పేర్కొన్నారు.

# అన్ని ప్రాంతాల అభివృద్ధికి నిధులను అందజేయండి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**మెదక్ అర్బన్, మార్చి 24 ప్రభాతవార్త:**

జిల్లాలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి పారిశ్రామిక వేత్తలు కొంత సీఎస్ఆర్ నిధులను వచ్చే ఏప్రిల్ నుండి జిల్లా కలెక్టర్ అకౌంట్‌కు అందజేయవలసిందిగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా కోరారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ రమేష్‌తో కలిసి పరిశ్రమ యాజమాన్యాలు, ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి పారిశ్రామికవేత్త లాభాలలో 2 శాతం సీఎంఆర్ క్రింద సామాజిక సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఎన్నో పరిశ్రమలు ఉన్నాయని, ఆయా పరిశ్రమలు తమ పరిధిలోని ప్రాంతాల అభిశృద్ధికి పరిమితం అవుతున్నాయని, అంతే గాక ముందస్తుగా జిల్లా యంత్రాంగం అనుమతి లేకుండా కార్యక్రమాలు చేపడుతున్నాయని, తద్వారా ఏ కంపెనీ ఎక్కడ ఎంత నిధులు వెచ్చిస్తుందో తెలియజకుండా పోతుందని, అత్యవసర కార్యక్రమా లకు నిధుల కొరత ఏర్పడుతుందని అన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగం వల్ల ఆశించిన ఫలితాలు రావాలంటే జిల్లా కలెక్టర్ కాతకు డబ్బులు జమ చేయాలని సూచించారు. అభివృద్ధి అనేది ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా అందరికీ న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం చక్కలి ప్రణాళికతో జిల్లా అంతటా అవసరం మేరకు దశల వారీగా కార్యక్రమాలు చేపడుతుందని, అప్పుడే జిల్లా అన్ని రంగాల్లో పురోగమిస్తుందన్నారు. జిల్లాలో ఉన్న సమస్యలు, చేపట్టవలసిన పనులపై ఏకీకృత నివేదిక రూపొందించ ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టుటకు అవకాశం ఉంటుందన్నారు. కంపెనీలు 30 శాతంమేర తమపరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి ఖర్చుచేసిన, మరో 30 శాతం పనులను జిల్లాలో చేపట్టుటకు తగు ప్రతిపాదనలు తీసుకువస్తే అనుమతిస్తామని లేదా ఇన్నోవేటిక్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మిగతా 40 శాతం నిధులు జిల్లా కలెక్టకన ఖాతాకు అందజేస్తే డిపాజిట్ చేసిన మేరకు జిల్లాలో చేపట్టిన పనులపై పాదర్శకంగా వివరాలు అందిస్తామని కలెక్టర్ పారిశ్రామిక వేత్తలకు సూచించారు. బాగా పనిచేసిన కంపెనీలకు 26 జనవరి, 15 ఆగస్టున ప్రశంసాపత్రాలతో సన్మానిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణమూర్తి, వివిధ పరిశ్రమల యజమానులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఖాజానా అధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

## ఒకటో తేదీన జీతాలు చెల్లించాలి : యుఎస్‌పిసి

**మెదక్ మున్సిపాలిటీ/కొల్చారం, మార్చి24 ప్రభాతవార్త:**

ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, ఈ కుబేర్‌లో ఉన్న అన్ని పెండిగ్ బిల్లుల చెల్లింపులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మెదక్‌జిల్లా యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఖాజానా అధికారి కార్యాలయం ముందు పెద్దఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు సంగయ్య మాట్లాడుతూ ధనిక రాష్ట్రం అని చెప్పే ప్రభుత్వం ఒకటో తేదీన జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉందని, అన్ని అలవెన్స్‌లు, జీపీఎఫ్ అడ్వాన్స్‌లు, బీమా సొమ్ములు కూడా చెల్లింపులు జరగడం లేదన్నారు. టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పోరాడి తెచ్చుకున్న తెలంగాణ ఒకటో తేదీన జితాలు చెల్లించాలని ఉద్యమం చేయాల్సి రావడం దురదృష్టకరమన్నారు. మూడు రోజుల్లో ఉద్యోగుల, ఉపాధ్యాయులు పెండింగ్ బిల్లుల ఆమోదానికి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో 28న ఛలో సెక్రటేరియేట్ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించడం జరుగుతుందని హెచ్చరించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌రావు, పద్మారావులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు హక్కుగా రావాల్సిన బకాయిలను చెల్లించక పోవడం విచారకరమన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొండల్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అవలంభిస్తున్న ఆర్థిక విధానాలను పున:పరిశీలన చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫన ఆడిట్ కమిటీ కన్వీనర్ యాదగిరి, ఉపాధ్యాయ దర్శిని ఎడిటర్ శశిధర్‌రెడ్డి, టీపీటీఎఫన జిల్లా నాయకులు రాజేంద్ర ప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, రాజయ్య, అల్వాల రమేష్, హీరాలాల్, దేవిసింగ్, గోపాల్, రామచంద్రారెడ్డి, సురేందర్, యాదగిరి, పద్మ, సంగీత, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగం, కొమ్మ రమేష్, నజీరోద్దీన్, ముద్దుల సత్యం, మంగ్యా నాయక్, సాయిబాబా, విఠల్‌రెడ్డి, లక్ష్మణ్, యూటీఎఫ్ జిల్లా నాయకులు శితల్‌సింగ్, రవీందర్‌రెడ్డి, భూషణం, సుధాకర్, అజయ్, దాదాపు 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీకి బాధ్యత వహించి**

## సిఎం కెసిఆర్ రాజీనామా చేయాలి

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

టిఎస్ పిఎస్సీ బోర్డును వెంటనే ప్రక్షాళన చేసి చైర్మన్ జనార్ధన్‌రెడ్డిని అరెస్టు చేయాలని పిడిఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి. శ్రీకాంత్, ఎఐపిఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మన్నె కుమార్‌లు డిమాండ్ చేశారు. టిఎస్ పిఎస్సీ పేపర్ లీకేజీకి బాధ్యత వహించి సిఎం కెసిఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలో విద్యార్థి ఐకాస నేతలు సిఎం కెసిఆర్ శవయాత్రకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని విద్యార్థి సంఘాల నాయకులు అరెస్టు చేశారు. దీంతో ఐకాస నాయకులు చేపట్టిన నిరసన ఉద్రిక్తంగా మారింది. ఓటిఆర్ చేసుకున్న నిరుద్యోగులకు ప్రతి నెల రూ.3016 చెల్లించాలన్నారు. పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు అనిల్, సంతోష్, ప్రశాంత్, అజ్మత్, సుజిత్,సాయి, ప్రదీప్, ప్రణయ్, నవీన్, శివ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు విధులకు అడ్డుతగిలిన వ్యక్తికి 2 రోజుల జైలు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

పోలీసు విధులకు అడ్డుతగిలిన వ్యక్తికి 2 రోజుల జైలు శిక్ష, 5 వంద జరిమాన విధిస్తూ శుక్రవారం న్యాయమూర్తి రమేష్ బాబు తీర్పునిచ్చినట్లు వన్‌టౌన్ సీఐ బిక్షపతి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన దున్నపోతుల పర్శరాములు వడ్డెర కాలనీ వద్ద పోలీసు విధులను అడ్డుకుంటూ దుర్భాషలాడుతూ న్యూసెన్స్ చేశారని తెలిపారు. న్యాయమూర్తి రమేష్‌బాబు ఎదుట పర్శరాములను హాజరుపరుచగా విచారణ అనంతరం రెండు రోజుల జైలు శిక్ష, రూ. 500ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు. పోలీసు విధులకు అటంకం కలిగించిన, మద్యం సేవించి న్యూసెన్స్, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## కెసిఆర్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి : ఎమ్మెల్యే

**వెల్దుర్తి, మార్చి 24 ప్రభాతవార్త:** శుక్రవారం వెల్దుర్తిలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయితీ సతత్ వికాస్ పురాస్కారాలను ఎంపికైన గ్రామ పంచాయితీల సర్పంచులు, కార్యదర్శులకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ఉమ్మడి మండలంలోని 27 గ్రామ పంచాయితీలు దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయితీ సతత్ వికాస్ పురాస్కారాలను అందజేశారు. ఉప్పులింగాపూర్, వెల్దుర్తి, కొప్పులిపల్లి, స్టేషన్ మాసాయిపేటలతో పాటు పలు గ్రామాలకు పురస్కారాలను అందజేశారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ పేదింటి ఆడపడుచుల పెళ్లిళ్ల కోసం కళ్యాణ లక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. పేద తల్లిదండ్రులకు ఈ పథకం ఎంతో సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, స్థానిక ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, తహశీల్దార్ నాగవర్ధన్, ఎంపీడీవో వెంకటలక్ష్మి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, మండల నాయకులు వేణుగోపాల్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



సర్పంచులకు, గ్రామకార్యదర్శులకు అవార్డులను అందజేస్తున్న మదన్‌రెడ్డి



ప్రజాప్రతినిధులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రసమయి

## సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే

**బెజ్జంకి, మార్చి 24, ప్రభాతవార్త :** అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక అవరణలో దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాల్లో భాగంగా 9 విభాగాల్లో ఉత్తమ సేవలు, మౌళిక సదుపాయాల కల్పనలో 14 గ్రామాలను ఎంపిక చేసి అయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులను శాలువతో సత్కరించి ప్రశంస పత్రాలను అందజేశారు. అలాగే జిల్లాస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీ జాబితాలో మండలంలోని రేగులపల్లి, చీలాపూర్ గ్రామాలు నిలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు లింగాల నిర్మల, కనగండ్ల కవిత,ద్యావనపల్లి మంజుల,దమ్మని రాము, విజయప్రకాష్‌రావు, కచ్చు రాజయ్య,డాక్టర్ వినోద్ బాబ్జీ, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, అయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## బహుమతులు సాధించిన సర్పంచ్‌కు ఘన సత్కారం



సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎంపిపి, జడ్పీటిసి తదితరులు

**కొమురవెల్లి, మార్చి 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రసులాబాద్ గ్రామానికి దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయత్-సతత్ వికాస్‌లో భాగంగా గుడ్ గవర్నెన్స్(సుపరిపాలన) పంచాయత్‌లో ప్రథమ బహుమతి, హెల్త్ పంచాయతీలో ద్వితీయ బహుమతి, నీటి సరఫరాలో ద్వితీయ బహుమతితోపాటు గ్రామానికి మొత్తం 3 బహుమతులు వచ్చాయి. మండలంలో రసూలాబాద్ గ్రామం అత్యధిక బహుమతులు పొందింది. అవార్డులు గెలుచుకోవడంతో శుక్రవారం సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిని ఎంపిటిసి కాయిత రాజేందర్‌రెడ్డిని, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌ను ఎంపిపి తలారి కీర్తన కిషన్, జడ్పీటిసి సిలివేరి సిద్దప్ప, ఇంచార్జి మండల స్పెషల్ అఫీసర్ రామారావు, వైస్ ఎంపిపి కాయిత రాజేందర్‌రెడ్డి, ఎంపిడివో అనురాధ, ఎంపిఓ మంజులలు శాలువాలతో ఘనంగా సత్కరించి సర్టిఫికెట్లు అందించారు.బహుమతులు రావడానికి సహకరించిన గ్రామ ప్రజలు, పంచాయతీ పాలక వర్గంతో పాటు సర్పంచ్‌ని అభినందించారు.

## అవిశ్వాసంలో విజయం మాదే: వార్డు సభ్యుడు రాజు



అవిశ్వాసనికి మద్దతు పలికిన వార్డు సభ్యులు

**కొండపాక, మార్చి 24, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి ఉప సర్పంచ్ బాలాగౌడ్‌పై వార్డు సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మాణంపై గజ్వేల్ ఆర్డిఒ విజయేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం గ్రామపంచాయితీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ బాలాగౌడ్‌కు వ్యతిరేకంగా అవిశ్వాసానికి మద్దతుగా 7 మంది వార్డు సభ్యులుండగా, బాలాగౌడ్‌కు మద్దతుగా 5గురు సభ్యులు మాత్రమే ఉన్నారు. దీంతో బాలాగౌడ్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. అయినప్పటికిని బాలాగౌడ్ అవిశ్వాస పరీక్షకు ముందుగానే కోర్టును ఆశ్రయించడంతో అవిశ్వాస ఫలితాన్ని అదికారులు ప్రకటించలేదు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. కోర్టు తీర్పు తర్వాత బాలాగౌడ్‌ను తొలగించి తిరిగి కొత్తగా ఉప సర్పంచ్ ఎన్నికకు నోటిఫికేషన్‌ను అధికారులు వెలువరించనున్నారు. అవిశ్వాసంలో పాల్గొన్న వార్డు సభ్యులు నైతికంగా గెలుపు మాదే అని రాచకొండ కనకయ్య, కొంతం రాజు, అశని రాజు, కొంతం మహిపాల్, చిన్నరాజుగాని సుజాత, గౌటి శ్రీలత, కొంతం భవానిలు సంతోషం వ్యక్తం చేశారు. అవిశ్వాసం విషయంలో సర ్పంచ్ ఓటు కీలకంగా ఉంటుంది కాని అ ఓటు ఇక్కడ అవసరం రాలేదు. వార్డు సభ్యులు ఇరువైపుల సమానంగా ఉన్నపుడు మాత్రమే సర్పంచ్ ఓటు కీలకమయ్యి గెలుపు ఒటములను నిర్ణహిస్తుంది.

## లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న బిజెపి పట్టణ అధ్యక్షుడు శంకర్‌బాబు తదితరులు

**హుస్నాబాద్ టౌన్, మార్చి 24,ప్రభాతవార్త:** టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బిజెపి పట్టణ అధ్యక్షుడు శంకర్ బాబు డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా మండలలాల అధ్యక్షుడు చెక్కబండి విద్యాసాగర్‌రెడ్డి, గొల్లపల్లి వీరాచారితో కలసి మాట్లాడుతూ పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపు మేరకు పార్టీ నాయకులు,కార్యకర్తలు,నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందుకూరి సతీష్,తోట సమ్మయ య్య,భూక్య సంపత్ నాయక్,రాంప్రసాద్,కోశాధికారి ఆకోజు అరుణ్‌కుమార్,పోలోజు రాజేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపోశమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవం



ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి కి ఆహ్వానం పత్రికను అందజేస్తున్న దృశ్యం

**దుబ్బాక, మార్చి 24, ప్రభాతవాత్త:** మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ 2 వార్డులోని శ్రీ పోశమ్మ తల్లి రెండవ వార్షికోత్సవం ఆహ్వానం పత్రికను మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి గారికి బిఆర్ఎస్ జిల్లా నాయకులు గోనెపల్లి సంజీవరెడ్డి తో కలిసి చెల్లాపూర్ మాదిగ మహరాజ్ సంఘ పెద్దలు శుక్రవారం హైదరాబాద్ ఎంపీ గారి నివాసంలో పోశమ్మ తల్లి పండుగ ఆహ్వాన పత్రికను అందజేసారు. ఈ కార్యక్రమంలో బొట్ల ఎల్లయ్య,దుబ్బాక రవి,రాజయ్య,దప్పు కనకయ్య, శ్రీను,గంభీర్పూర్ కనుకరాజ్ పాల్గొన్నారు.

## నిరుద్యోగ మహా ధర్నాను విజయంతం చేయండి

**చిన్నశంకరంపేట, మార్చి 24, ప్రభాతవార్త:**

నేడు (శనివారం) టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజికి నిరసనగా భాగ్యనగరంలో భాజాపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలో చేపట్టే నిరుద్యోగ మహ ధర్నాకు చిన్నశంకరంపేట మండల భాజాపా నాయకులు,కార్యకర్తలు, నిరుద్యోగ యువత హజరు కావాలని భాజాపా పార్టీ మండల అధ్యక్షుడు పోగుల రాజు ఒక ప్రకటనలో కోరారు.



సర్పంచ్‌లకు అవార్డులను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

## బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పంచాయతీలు అభివృద్ధి : ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**నర్సాపూర్, మార్చి 24 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామ పంచాయతీలలో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడి అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ పంచాయతీ అవార్డులకు ఎంపికైన పంచాయతీలకు అవార్డులను అందజేసి సర్పంచ్‌లను. పంచాయతీ కార్యదర్శులను, ఎంపిటిసీలను శాలూవాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే గ్రామ పంచాయతీల రూపు రేకలు మారాయన్నారు ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, డిఆర్‌డిఏ పిడి శ్రీనివాస్, ఇంచార్జీ ఎంపిపి వెంకటనర్సింగరావు, జడ్పిటిసి బాబ్యానాయక్, సిడిపిఓ హేమాబార్గవి, ఎంపిడిఓ మార్టిన్ లూథర్ వివిద గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో సర్పంచులే కీలకం : ఎంపిపి



సర్పంచలను సన్మానిస్తున్న ఎంపీపీ,ఎంపీడీవో,జడ్పీటీసీ సభ్యురాలు

**చిన్నశంకరంపేట,మార్చి 24, ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర అని ఎంపీపీ సభ్యురాలు ఆవుల భాగ్యలక్ష్మిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని సమావేశ మందింరంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ సత్ వికాస్ అవార్డుల వేడుకల్లో జడ్పీటీసీ సభ్యురాలు పట్లోరి మాదవిరాజుతో కలిసి మండల స్థాయిలో వివిధ అంశాల కింద ఎంపికైన 22 మంది పంచాయతీల సర్పంచలను, కార్యదర్శు లకు అవార్డులను ప్రదానంచేసి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డులు అందుకున్న వారు ఇదే స్పూర్తితో పని చేసి గ్రామాలను మరింతగా అభివృద్ధి పర్చాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విజయశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవిణ్, ఎంపీవో గిరిధర్‌రెడ్డి, సూపరిండెంట్ అశోక్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నేషనల్ పంచాయతీ అవార్డ్స్ అందజేత



అవార్డు అందుకుంటున్న దృశ్యం

**నిజాంపేట, మార్చి 24, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం నేషనల్ పంచాయతీ అవార్డ్స్‌ను ఇంచార్జి ఎంపిడిఓ రాజేందర్, ఎంపిపి సిద్దరాములులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక సిఎం కేసీఆర్ సంక్షేమంతోపాటు అభివృద్ధి లక్ష్యంగా పల్లెలను, పట్టణాలను తీర్చిదిద్దుతున్నారని అన్నారు. గ్రామాలు అభివృద్ది చేందుతేనే రాష్ట్రం బాగుంటుందని సంకల్పంతో గ్రామ సర్పంచులు, సెక్రటరీలు గ్రామంలో పారిశుధ్య పనులతో పాటు నరగామాల అభివృద్దికి కృషి చేసినందుకు మండలంలోని 14 గ్రామ పంచాయతీలు కాగా 12 గ్రామ పంచాయతీలు ఎంపిక కావడంతో పలు గ్రామాల సర్పంచులకు ఎంపీపీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అమరసేనారెడ్డి, అనూష, రజిత, సునీత, నర్సవ్వ, బాల్ నర్సవ్వ, కవిత, ప్రీతి, అరుణ్, అనిల్‌కుమార్, కృష్ణవేణి, ఎంపీటీసీలు బాల్‌రెడ్డి, సురేష్, కో ఆప్షన్ గౌస్, సెక్రటరీలు అరీఫ్ హుస్సేన్, ప్రశాంత్ గౌడ్, నర్సింహారెడ్డి, నర్సింలు, ప్రేమ, నాగలక్ష్మి, కవిత పాల్గొన్నారు.

## సిఎం కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

**నర్సాపూర్, మార్చి 24, ప్రభాతవార్త :** సెర్ప్ సిబ్బందికి పే స్కేల్ వర్తింప జేస్తూ జివో నెంబర్ 11 ను విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయలో సిఎం కెసిఆర్ చిత్రపటానికి క్షీరాబిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పే స్కేల్‌ను వర్తింపచేయడం పట్ల సెర్ప్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో నర్సాపూర్ మండల సెర్ప్ సిబ్బంది ఏపిఎం మార్గం గౌరిశంకర్, సిసి లు దేవిసింగ్, రవిందర్, బాగ్య, సమత, ఆంజనేయులు, ప్రవీణ, మల్లేష్, సురేశ్, లక్ష్మి, కరుణాకర్ తదితర సెర్ప్ సిబ్బంది పాల్గొనగా జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, డిఆర్‌డిఎ పిడి శ్రీనివాస్, ఇంచార్జీ ఎంపిపి వెంకటనర్సింగరావు, జడ్పిటిసి బాబ్యానాయక్, సిడిపిఓ హేమాబార్గవి, ఎంపిడిఓ మార్టిన్ లూథర్ వివిద గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## భానూరు పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన..పాల్గొన్న ఎమ్మెల్యే



భానూరు పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, కాలె యాదయ్య

**పటాన్‌చెరు, మార్చి 24 ప్రభాతవార్త:** పటాన్‌చెరు మండల భానూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించి నల్ల పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించడంలో భాగంగా నూతన దేవాలయాలు నిర్మించడం సంతోషకరమన్నారు. దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలి

### -జెడ్పీటీసీ ముత్యంగారి మేఘమాల సంతోష్

**కొల్చారం, మార్చి23 ప్రభాతవార్త:** ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగపరుచుకొని మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని కొల్చారం జెడ్పీటీసీ ముత్యంగారి మేఘమాల సంతోష్ అన్నారు. శుక్రవారం కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో మహిళలకు పావలా వడ్డీ రుణాలు పత్రాలను అందజేశారు. కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో మహిళా గ్రూప్ సభ్యులకు పావలా వడ్డీ రుణమాఫీ పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొల్చారం జెడ్పీటీసీ ముత్యంగారి మేఘమాల సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా గ్రూప్ సభ్యులకు పావలా వడ్డీ మాఫీ పత్రాలను అందజేశారు. అనంతరం జెడ్పీటీసీ మేఘమాల సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎందిగేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం దైవ సుశిల్వ, సర్పంచి ఉమా శ్రీకాంత్, మహిళా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి మండల అధ్యక్షుడు రమేష్

## పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం విఫలం : పల్లె రమేష్

**ములుగు, మార్చి 24 (ప్రభాతవార్త):** టిఎస్‌పిఎస్సీ గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ములుగు మండల బిజెపి అధ్యక్షుడు పల్లె రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నాపత్రాలు అమ్ముకొని నిరుద్యోగుల పొట్టగొడుతుందన్నారు. సిట్ ద్వారా విచారణ చేయకుండా సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని, దీనికి కారణమైన ఐటి మంత్రి కెటిఆర్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పరీక్షలు రాసిన నిరుద్యోగులందరికీ రూ.లక్ష నష్టపరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి మన్నె శ్రీనివాస్, ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి తలారి లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి అన్నెబోయిన యాదగిరి, బిజెవైఎం మండల అధ్యక్షుడు మల్యాల స్వామి, బూత్ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

## కుల సంఘాల ఐక్యతతోనే హక్కుల సాధన

**కొండపాక, మార్చి 24, ప్రభాతవార్త :** ఆరె కులస్తులు రాజకీయంగా ఎదగాలని సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మన్నెం భూపతిరావు పిలుపు నిచ్చారు. శుక్రవారం దుద్దెడ రైతు వేదికలో ఆరె కులస్తుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల సంఘం పరిష్టంగా ఉంటేనే హక్కులు సాధించుకోగలమన్నారు. ఆర్ధికంగా, రాజకీయంగా ఎదిగినపుడే మనుగడ సాధించగలమని తెలిపారు. సంఘం పటిష్టత కోసం మండలంలోని అన్ని గ్రామాల్లో సంఘ సమావేశాలు ఏర్పాటు చేసి మండల కమిటీని ఎన్నుకొవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవధ్యక్షుడు గురజాడ శ్రీనివాస్, వివిధ మండలాల అధ్యక్షులు, రవీంద్రనగర్ సర్పంచ్ వాసరి లింగరావు, వెంకటరమణ, కుసుంబ శ్రీనివాస్, జిల్లా నాయకులు దొనే రామరావు, ఎంపిటిసి గురజాడ బాలాజీ, వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కెసిఆర్ పాలనలో మహిళలకు ప్రాధాన్యత



కేసీఆర్, మంత్రుల చిత్ర పటానికి పాల భిషేకం చేస్తున్న దృశ్యం

**కొండపాక, మార్చి 24, ప్రభాతవార్త :** సెర్ప్ ఉద్యోగులకు జి ఒ నెంబర్ 11 ప్రకారం వేతన సవరణ జరిగినందుకు, వడ్డీలేని రుణాలు మంజూరి చేసినందుకు మండల సేర్ప్ ఉద్యోగులు మండల సమైఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం కొండపాకలో సీఎం కేసీఆర్, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు, గ్రామీణాభివృద్ది శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చిత్ర పటాలకు పాల భిషేకం చేశారు. అనంతరం అనంతుల ప్రశాంత్‌కు శాలువ కప్పి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమైఖ్య అధ్యక్షురాలు మమత, ఎంఎస్ కార్యదర్శి లావణ్య, కోశాధికారి లిఖిత, ఎపిఎం శ్రీనివాస్, డిఎంజి బ్రహ్మచారి, సిసిలు యాకుబ్, అశోక్, లింగం, సుల్తానా, బాలకిషన్, కవిత, జ్యోతి, లక్ష్మి, సుమలత, విజయ, స్వాతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## దీన్ దయాల్ పంచాయతీ పురస్కారాలను అందుకున్న సర్పంచులు



పంచాయితీ పురస్కారాలను అందుకున్న సర్పంచులు

**మెదక్ రూరల్, మార్చి 24 ప్రభాతవార్త:** ఎంపీడీవో కార్యాలయంలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయితీ సతత్ వికాస్ పురస్కారాలను మండలంలోని సర్పంచులకు ఎంపీడీవో ఆధ్వర్యంలో ఎంపీపీ గంగన్నగారి యమున జయరాంరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయితీ సతత్ వికాస్ పురస్కారాలతో సన్మానించడం గొప్ప విషయమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరాములు, వైస్ ఎంపిపి ఆంజనేయులు, సర్పంచులు వికాస్, నర్సమ్మ, శ్యామవ్వ, స్వప్న, నర్సింలు, సంధ్యారాణి, సరోజ, లింగమ్మ, జానకిరామ్‌రెడ్డి, ప్రేమలత, సిద్ధాగౌడ్, రజని, తులసి, మాధవి, లక్ష్మీ, రాజ్యలక్ష్మీ, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉత్తమ గ్రామ పంచాయతీ సర్పంచులకు ప్రశంసా పత్రాలు అందజేత



సర్పంచులు, కార్యదర్శులను సన్మానిస్తున్న దృశ్యం

**అల్లాదుర్గం, మార్చి24 ప్రభాతవార్త:** మండలంలో ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన సర్పంచులను ఎంపీడీవో కార్యాలయంలో టెలికామ్ అడ్వైజర్ డి.కాశీనాథ్, జెడ్పీటీసీ సౌందర్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యదర్శులను సన్మానించారు. అల్లాదుర్గం మండలానికి 27 అవార్డులు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డి. కాశీనాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులను మంజూరు చేయకున్నా అభివృద్ధిలో గ్రామీణ ప్రాంతాలు అగ్రగామిగా నిలిచాయన్నారు. అనంతరం ఉత్తమ గ్రామ పంచాయితీలు ఎన్నికైన గ్రామాల సర్పంచులకు, పంచాయితీ కార్యదర్శులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. సీఎం కేసీఆర్ పాలనలో పల్లెలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో శంకర్, మండల అధికారులు సయ్యద్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు అంజి యాదవ్, సర్పంచులు బేతయ్య, రంజిత్, సోని రాథోడ్, రాజు, సుభాష్, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## వరి పంటకు ఆశించే చీడపీడలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మెదక్ రూరల్, మార్చి24 ప్రభాతవార్త: వరి పంటకు ఆశించే చీడపీడలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు మెదక్ జిల్లా వ్యవసాయ అధికారిణి ఆశ కుమారి సూచించారు. ప్రస్తుతం వరి పంటకు ఆశించి చీడపీడల నివారణకు అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు, సలహాలు రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉంటారని జిల్లా వ్యవసాయ అధికారిణి అన్నారు. శుక్రవారం మెదక్ మండలంలోని అవుసులపల్లి గ్రామంలో వరి పంట పొలాలను జిల్లా వ్యవసాయ అధికారిణి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటకు అగ్గి, మెడ విరుపు తెగులు ఎక్కువగా సోకుతుందని, దీని నివారణకు ట్రైసైక్లోజోల్‌నుండి 120 గ్రా. లేదా టిబ్యుకొనజోల్, ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్‌ను 100 గ్రా. లేదా పికాక్సిస్ట్రోబిన్, ట్రైసైక్లోజోల్‌ను 400 మి.లీ ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. దీంతో పాటు రిలో మొగి పురుగు, తెల్ల కంకి నివారణకు కార్టప్ హైడ్రైక్లోరైడ్‌ను 400 గ్రా. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల వీటి ఉధృతి తగ్గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సందీప్, రైతులు సిద్ధిరాములు, రాములు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సిఎం సహాయనిధి కొండంత అండ

**కొండపాక, మార్చి 24, ప్రభాతవార్త :** సీఎం సహాయనిధి పేదలకు కొండంత అండ అని బిఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అనంతుల ప్రశాంత్ అన్నారు. శుక్రవారం కొండపాకలో సీఎం సహాయనిధి దొంతర బోయిన కనకయ్యకు రూ॥ 60 వేల, మంతురి యాదయ్యకు రూ॥ 60 వేల, ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన కొటమైన రాజుకు రూ॥20 వేల చెక్కులను అందించారు. అనంతరం సీఎం కేసీఆర్‌కు, మంత్రి హరీష్‌రావులు సీఎం సహాయనిధి ద్వారా పేదలను అదుకుంటునందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## 'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

**దుబ్బాక, మార్చి 24, ప్రభాతవాత్త:** కంటివెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినిమోగం చేసుకోవాలి ఎంపీడీఓ వేలేటి భాస్కరశర్మ అన్నారు. మండల పరిధిలోని హసన్ మీరాపూర్ గ్రామంలో సర్పంచ్ ఎంటే లక్ష్మినాగయ్య కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ వార్డు సభ్యులు మల్లేశం, గిరి,పంచాయతీ కార్యదర్శి పూర్ణచందర్,బిఆర్ఎస్ నాయకులు ఎంటే రమేష్,ఏఎన్ఎం లు భారతి సుజాత, తిమ్మాపూర్ పిహెచ్ సి సిబ్బంది డా,గౌతమి, స్వామి, అరుంధతి, స్వాతి, ఆప్టోమేటిస్ట్ యూసుఫ్,ఆశాలు వర్కులు రేణుక,మణెమ్మ,నాగరాణి, భాగ్యలక్ష్మి, పలువురు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : సర్పంచ్

**కొండపాక, మార్చి 24, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని సర్పంచ్ చిట్టి మాధురి అన్నారు. శుక్రవారం కొండపాకలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో అలయెన్స్ క్లబ్ సహాయంతో ఎప్రిల్‌లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, కంపాస్ బాక్స్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య అభివృద్ధి కోసం కృషిచేస్తున్న అలయెన్స్ క్లబ్ సభ్యులను ఆమె అభినందించారు. అలయెన్స్ క్లబ్ సిద్దిపేట జిల్లా గవర్నర్ సోమ వనజ మాట్లాడుతూ పాఠశాలకు పరీక్ష సామాగ్రిని అందిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజశ్రీ, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ రాములు, విశాంత్ర ఉపాధ్యాయులు రాజ వెంకట్‌రెడ్డి, క్లబ్ వైస్ గవర్నర్ శివకుమార్, సభ్యులు రాజేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు రామస్వామి, హారతి, పర్శరాములు, శ్రీనివాస్, కనకయ్య, జలజ, బాలమల్లయ్య, నిర్మల, బిక్షపతి, రవీందర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**అక్కన్నపేట, మార్చి 24, ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన జీర్ల కనుకవ్వ ఇటీవల గుండె పోటుతో మరణించిన విషయం తెలుసుకున్న ఆమె కుమారుని పదవతరగతి 2006-07 మిత్రబృదం శుక్రవారం రోజున వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా తనకు అండగా నిలిచేందుకు 31వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు కుమారస్వామి, రవి , శ్రీకాంత్, ఈశ్వర్, తిరుపతి, లావుడ్య తిరుపతి, రాఖేష్, రమేష్, రాజు, శ్రీనాథ్, శ్రీనివాస్, వేణు, కమలాకర్, ప్రమోద్, విక్రమ్, రాజు, బిక్షపతి, మహేందర్, సారయ్య, మధు, రమేష్, మహేష్‌నవీన్, ఆవోక్, రాజు, శ్రీను, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిని నివారించవచ్చు

**హుస్నాబాద్ రూరల్, మార్చి 24, ప్రభాతవార్త :** క్షయవ్యాదిపి పూర్తిగా నివారించవచ్చని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రోజున పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది క్షయ వ్యాది నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. చేయి చేయి కలిపి వ్యాదిని నివారిద్దామని నినాదాలు చేశారు. పంతం ఉంటే ఈ వా ్యధిని పూర్తిగా నివారించవచ్చన్నారు. హుస్నాబాద్‌తో పాటు మండలంలోని మీర్జాపూర్,రామవరం,అక్కన్నపేట,ప్రభుత్వ ఆసుపత్రులలో సైతం క్షయ వ్యాధి నిరావణ సందర్భంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

## 50 కిలోల బియ్యం అందజేత

**అక్కన్నపేట, మార్చి 24,ప్రభాతవార్త :** అక్కన్నపేట మండలం చాపగానితండ గ్రామంలో బొమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి,రాజన్‌నాయక్‌లు ఇటీవల చాపనాయక్ మృతి చెందగా అతని కుటుంబానికి 50కిలోల బియ్యాన్ని వారి కుటుంబానికి అందచేసారు. ఈ కార్యక్రమంలో భూక్య సుధాకర్,రైనానాయక్,ముధావత్ రమేష్,గుగులోతు రాజునాయక్ తదితరులున్నారు.

## నిరుద్యోగ మహాధర్నాకు తరలిరావాలి

### -బిజెపి మండల అధ్యక్షుడు తుడుపునూరి రమేష్

**మర్కుక్, మార్చి 24 (ప్రభాతవార్త):** హైద్రాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నేడు బిజెపి చేపడుతున్న నిరుద్యోగ ధర్నాను విజయవంతం చేయాలని బిజెపి మర్కుక్ మండల పార్టీ అధ్యక్షుడు తుడుపునూరి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మహాధర్నా చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ ధర్నాలో పలు డిమాండ్లు, క్యాబినెట్ నుండి కెటిఆర్‌ను బర్తరఫ్ చేయాలని, టిఎస్ఎస్ పరీక్షలు రాసిన నిరుద్యోగులకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉద్యోగాలు సక్రమంగా ఇవ్వాలనే ఉద్దేశ్యంతో మహాధర్నా చేపడుతున్నామన్నారు. మండలం నుండి నిరుద్యోగులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలన్నారు.

## విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన

**వర్గల్, మార్చి 24 (ప్రభాతవార్త):** మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో మిల్లెట్స్, పౌష్టికాహారంపై అవగాహన కల్పించినట్లు ఐసిడిఎస్ సూపర్ వైజర్ టి.సునీత తెలిపారు. మిల్లెట్స్ అనగా సామలు, కొర్రలు, ఊదలు, అరికలు, రాగులు అని, ఇవన్నీ ప్రకృతి ప్రసాదించిన వరాలు, ఔషధ గుణాల సమ్మిళితమైన తిండిగింజలు అన్నారు. వీటిని తినడం వల్ల ఆరు నెలల నుండి రెండు సంవత్సరాలలో ఎవరైనా వ్యాధులను ఈ చిరుధాన్యాల వల్ల నిర్మూలించుకోవచ్చన్నారు. విద్యార్థుల ఆరోగ్య విషయంపై తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పిల్లలు ఎదిగే వయస్సులో మంచి ఆహారాన్ని అందించాలని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కవిత కృష్ణ, ఎంపిటిసి జయమ్మ భీంరెడ్డి, పాఠశాల హెచ్ఎం అనిత, అంగన్‌వాడీ టీచర్ టి.అన్నపూర్ణ, ఆయా బి.శోభ, గర్భవతులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## మూడు ప్రత్యేక పంచాయతీలుగా ప్రకటించండి

**అక్కన్నపేట, మార్చి 24, ప్రభాతవార్త :** మండలంలోని మారుమూల ప్రాంతాలైన చౌడుతండ, బోదరవాగుతండ, మంజ్యానాయక్ తండలను ప్రత్యేక గ్రామ పంచాయితీలుగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకునేలా అధికారులు నివేదికలు పంపించాలని కోరుతూ గ్రామాలకు చెందిన తండవాసులు గుగులోతు అర్జున్, గుగులోతు రాజన్‌నాయక్, భూక్య సుధాకర్ నాయక్, ముధావత్ రమేష్‌నాయక్,భూక్య తిరుపతినాయక్, గుగులోతు సేవాలాల్‌నాయక్, భూక్య గణేష్‌నాయక్‌లు శుక్రవారం అక్కన్నపేట ఎంపిడివో సత్యాపాల్‌రెడ్డిలకు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

## నిరుద్యోగ మహాధర్నాను విజయవంతం చేయాలి

**బెజ్జంకి, మార్చి 24, ప్రభాతవార్త :** హైదారాబాద్‌ని ఇందిరాపార్కు వద్ద టిఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ సంఘటనకు నిరసనగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అధ్వర్యంలో చేపట్టబోయే నిరసన కార ్యక్రమానికి మద్దతుగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో నిరుద్యోగ, యువత, బిజెపి కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పాలొగని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు దొంతరవేణి శ్రీనివాస్, గైనీ రాజు, బొనగిరి మహేష్, వడ్లూరు శ్రీనివాస్, భూషణంలు పిలుపునిచ్చారు.

## జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలి

సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర ఈనెల 26న మండలంలోని దేవక్కపల్లి గ్రామంలో ప్రవేశిస్తున్నందున మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు అంబేద్కర్ చౌరస్తా వద్ద జన చైతన్య యాత్ర గోడ పత్రికను అవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సాయికృష్ణ, బొనగిరి లింగం, బండి చంద్రయ్య, కుంట సత్తయ్య, బొనగిరి రాజలింగం, బొనగిరి అంతయ్య, బొనగిరి దుర్గయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి నాయకులు



బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

## బోరంచ నల్లపోచమ్మ ఆదాయం రూ. 6లక్షల 72వేలు

**మనూర్, మార్చి 24, ప్రభాతవార్త:** మండలంలోని బోరంచ గ్రామంలో కొలువుండి భక్తులచే నిత్యపూజలందుకుంటున్న నల్లపోచమ్మకు భక్తులు 6లక్షల 72వేల 102 రూపాయలు సమర్పించుకున్నట్లు ఆలయ ఇఓ మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఆలయంలో భక్తులు సమర్పించుకున్న కానుకలను లెక్కించామన్నారు. కార్యక్రమంలో దేవాశాయ శాఖ ఎండోమెంట్ జిల్లా కమీషనర్ శిరాజన, ఎస్ఐ లక్ష్మణ్, ఆలయ అర్చకులు శ్రీకాంత్‌స్వామి, సిద్దుస్వామి, నాగయ్యస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మామిడితోటలను పరిశీలించిన హార్టికల్చర్ అధికారి



మామిడితోటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి సునీత తదితరులు

**సదాశివపేట, మార్చి 24, ప్రభాతవార్త:** ఈదురుగాలులతో, వడగండ్లతో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ఉద్యానవన పంటలను శుక్రవారం హార్టికల్చర్ జిల్లా అధికారి సునీత పరిశీలించారు. మండలంలోని తంగెడు పల్లి, అంంకెనపల్లి, మెలిగిరపేట, మద్దికుంట తదితర గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న ఉల్లి, మొక్కజొన్న పంటలను, మామిడి తోటలను తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తితో కలిసి పరిశీలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం అందించేందుకు సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. రైతులు నష్టాల వివరాలను మండల వ్యవసాయాధికారులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అనిత, హార్టికల్చర్ అధికారి స్పందన, నాయకులు సిద్దన్న, ఏఈఓలు అంజన్న, ప్రభు, చరణ్, రైతులు పాల్గొన్నారు.

## చౌటకూరు జడ్పీహెచ్ఎస్‌లో ప్రపంచ జలదినోత్సవం




ప్రపంచ జలదినోత్సవంలో మాట్లాడుతున్న దివ్యజ్యోతి

**చౌటకూరు, మార్చి 24, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్టు దివ్యజ్యోతి హాజరై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విజన్ వాటర్ ఏయిడ్ స్వచ్చంద సంస్థల ద్వార గ్రామాల్లో కొనసాగుతున్న కార్యక్రమాలపై, జల సంరక్షణ, గ్రౌండ్ వాటర్ రీచార్జ్ హార్వేస్టింగ్ స్లక్చర్స్ లపై స్టాల్స్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీరు వృధాకాకుండా తీసుకోవాల్సి న జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ వీరమణి, ఎంపిటిసిసభ్యులు భూపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు జి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్, స్పీచ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన విద్యార్థులు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బాల సైదా బాబు, దివ్య జ్యోతి, అంగన్‌వాడి టీచర్లు, వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు, విజన్ సంస్థ సభ్యులు విజయరేఖ, ఇందిర, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు దీన్ దయాళ్ పురస్కారాలు



సర్పంచ్‌లకు పురస్కారాలు అందచేస్తున్న దృశ్యం

**పుల్కల్, మార్చి 24, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా పంచాయతీలకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు అందచేశారు. మొదటి థీమ్‌లో పుల్కల్, ఎస్ ఇటిక్యాల్, హన్మనాయక్ తండా, 2వ థీమ్‌లో పెద్దరెడ్డిపేట, మిన్‌పూర్, ముదిమానిక్, 3వ థీమ్‌లో మంతూర్, గొంగ్లూర్ తండ, ముద్దాయిపేట, 4వ థీమ్‌లో లక్ష్మీసాగర్, లింగంపల్లి, గొంగ్లూర్, 5వ థీమ్‌లో బొమ్మారెడ్డి గూడెం, పోసానిపల్లి, పోచారం, 6వ థీమ్‌లో మిన్‌పూర్ తండా, కోడూర్, కొర్పోల్, 7వ థీమ్‌లో గంగోపిపేట్, వెండికోల్, బస్వాపూర్, 8వ థీమ్‌లో ఇసోజిపేట్, లాల్‌సింగ్ నాయక్ తండా, బద్రిగూడెం, 9వ థీమ్‌లో చిక్రియాల్, ఉప్పరిగూడెం, సింగూర్ పంచాయతీలు ఉన్నాయి.

## పరీక్ష కేంద్రాల్లో సకల సౌకర్యాలు కల్పిస్తాం:డిఇవో



10 విద్యార్థులతో మాట్లాడుతున్న డిఈఓ రాధా కిషన్

**పాపన్నపేట, మార్చి 24, ప్రభాతవార్త:** రానున్న పదవ తరగతి వార్షిక పరీక్షలను పురస్కరించుకుని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రాధాకిషన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపల్లి, యూసుఫ్‌పేట, కుర్తివాడ, పాపన్నపేట పాఠశాలలను మండల విద్యాధికారి నీలకంఠంతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా రాధాకిషన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పరీక్షలురాసి ఉన్నతచదువులకు వెళ్లాలన్నారు. పరీక్ష పత్రాలు సిసి కెమెరాల నీడలో ఓపెన్ చేసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. డిఈఓవెంట పాపన్నపేట, కుర్తివాడ, యుసూఫ్‌పేట ప్రధానోపాధ్యాయులు హరిసింగ్, అంజాగౌడ్, నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## రేవయప్ప గుడిలో సిసి కెమెరాల ఏర్పాటు

**మనూర్, మార్చి 24, ప్రభాతవార్త:** మండలంలోని రేవయప్ప ఆలయంలో ఏర్పాటుచేసిన సిసి కెమెరాలను ఎస్ఐ లక్ష్మణ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ సిసి కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు తగ్గుముఖం పట్టడం తథ్యమన్నారు. రౌడ్ ద క్లాక్‌గా పరిసరాల్లో నిఘా ఉంటుందని, అందుకు నేరాలు చేసేందుకు ప్రజలు జంకుతారన్నారు. కార్యక్రమంలో సుధాకర్, రాజ్‌కుమార్, విజయ్, గుండప్ప తదితరులు పాల్గొన్నారు.

# తాగునీరు, విద్యుత్ సమస్య లేకుండా చూడాలి

### ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**శివ్వంపేట, మార్చి 24 ప్రభాతవార్త:** అభివృద్ధిలో శివ్వంపేట మండలాన్ని ఆదర్శంగా నిలపాలని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలు ప్రజలకు సకాలంలో అందించే విధంగా అధికారులతో కలిసి చర్యలు తీసుకోవాలన్నారు. ఎండాకాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలను ఎప్పటి కప్పుడే పరిష్కరించాలన్నారు.మన ఊరు మన బడి కార్యక్రమాన్ని వందశాతం విజయవంతమయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సకాలంలో ప్రజలకు సేవలు అందించాలన్నారు. గ్రామ పంచాయతీలకు రావాల్సి న నిధులు త్వరలో ప్రభుత్వం అందజేస్తుందని స్పష్టం చేశారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డులు...**

మండలంలో ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన తొమ్మిదిపంచాయతీలకు ఎమ్మెల్యే మదన్ రెడ్డి మెమెంటోలతోపాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లాలోనే శివ్వంపేట మండలాన్ని ఆదర్శంగా నిలిపేందుకు ప్రజాప్రతినిధులతో పాటు గ్రామ కార్యదర్శులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, ఎంపీపీ ఉపాధ్యక్షులు రమాకాంత్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన గొర్రె వెంకటరెడ్డి, ఇంచార్జి ఎంపీడీవో తిరుపతిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు లాయక్, మండల ప్రత్యేకాధికారి నర్సయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషన్, వ్యవసాయ శాఖ ఏడీ సురేఖ, ప్రభుత్వ వైద్యాధికారి సాయి సౌమ్య, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, పశు వైద్యాధికారిని జె. సంధ్యారాణి, గ్రంథాలయాధికారిని అర్చన, ఏఈలు ప్రవీణ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్‌లకు దీన్ దయాళ్ పురస్కారాలు అందచేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## నియోజకవర్గంలో 54 పంచాయతీలకు పురస్కారాలు

**జహీరాబాద్/న్యాల్‌కల్/ఝరాసంగం, మార్చి 24, ప్రభాతవార్త:** దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సశక్తి కిరణ్ పురస్కారాలను పంచాయితీ సర్పంచ్‌లు అందుకున్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్ పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని జహీరాబాద్,న్యాల్‌కల్, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాలకు చెందిన 54 పంచాయతీలకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పురస్కారాలు అందచేసి, సర్పంచ్‌లను శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో న్యాల్ కల్ ఎంపిపి అధ్యక్షులు అంజమ్మ, ఆయా మండలాల ఎంపిడిఓలు సుమతి సుజాత నాయక్, వెంకట్‌రామ్‌రెడ్డి, మహేష్, సుజాత, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు దీన్‌దయాళ్ అవార్డులు



సర్పంచ్‌లకు దీన్ దయాళ్ అవార్డులు అందచేస్తున్న ఎంపిపి చందనరెడ్డి దృశ్యం

**పాపన్నపేట, మార్చి 24, ప్రభాతవార్త:** గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం పురోగమిస్తుందని ఎంపిపి అధ్యక్షులు చందనరెడ్డి అన్నారు. శుక్రవారం పాపన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆయా పంచాయతీలకు జాతీయ దీన్ దయాళ్ పురస్కారాలను ఆయన పంపిణీ చేశారు. 9 విభాగాల్లో 27 పంచాయితీలను ఉత్తమ పంచాయితీలుగా గుర్తించి బాధిత సర్పంచ్‌లకు అవార్డులు అందచేశారు. ఇదిలా ఉండగా గతంలో ఎంపిడిఓగా బాధ్యతలు నిర్వహించి కౌడిపల్లి మండలానికి వెళ్లిన ఎంపిడిఓ శ్రీనివాస్, చేగుంట మండలానికి బదిలీపై వెళ్లిన ఎన్ఆర్ఈజిఎస్ ఏపిఓ శ్వేతలను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపిడిఓ జగదీశ్వర చారి, ఎంపిపి ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు జగన్నాథం, మండల కో-ఆప్షన్ సభ్యులు గౌస్, మార్కెట్ కమిటి చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపిఈఓ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 16 పంచాయతీలకు పురస్కారాల అందచేత



తుర్కవాడగావ్ సర్పంచ్‌కు అవార్డులు అందచేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**కంగ్టి, మార్చి 24, ప్రభాతవార్త:** దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ జాతీయ పంచాయితీ అవార్డులను నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి సర్పంచ్‌లకు శుక్రవారం అందచేశారు. మండలంలోని 16 పంచాయితీలకు 9 అంశాలపై అవార్డులు అందించారు. సర్పంచ్‌లకు శాలువాలతో సత్కరించి పురస్కారాలు అందచేసి ప్రత్యేకంగా అభినందించారు.

## నర్సాపూర్ బస్టాండ్ లో చిరుధాన్యాలపై అవగాహన

**నర్సాపూర్, మార్చి 24.ప్రభాతవార్త:** పోషణ పక్వాడ కార్యక్రమంలో బాగంగా ఐసిడిఎస్ నర్సాపూర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నర్సాపూర్ బస్టాండ్ లో డిపో మేనేజర్స్, కండక్టర్స్, డ్రైవర్స్‌ల తో పాటు ప్రయాణీకులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించి ప్రత్యక్షంగా చిరుధాన్యాల వంటలు చేసి చూయించడం జరిగింది.బస్‌లో ఉన్న ప్రయాణీకులకు సైతం చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తు రాగి లడ్డూలను ఇవ్వడం జరిగింది.అంతేగాక నర్సాపూర్‌లోని 4వ అంగన్‌వాడికేంద్రంలో 15 మంది తల్లులకు రాగి సంకటి, సామల స్వీట్లు, పాలు, గ్రుడ్లు అందరికి పెట్టడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి బ్రహ్మాజీ, సిడిపిఓ హేమాభార్గవి, సూపర్ వైజర్ లు సరళకుమారి, అనిత, కమ్మరు సుల్తానా, నర్సాపూర్ మండలంలోని అంగన్‌వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి : ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, మార్చి 24 ప్రభాతవార్త:** ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో శిథిలావస్థకు చేరుకున్న పురాతన పాఠశాల భవనాలను తొలగించి నూతన భవనాల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో జేకే ఫెన్నార్ సంస్థ సహకారంతో 25 లక్షలరూపాయల నిధులో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదులను శుక్రవారం సాయంత్రం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు మన బడి పథకం ద్వారా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పటాన్‌చెరులో కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేకే ఫెన్నార్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ శర్వన మార్థాండన్, డాక్టర్ సర్వేష్, మోహన సుందరం, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్ పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**కొల్చారం, మార్చి24 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అంసానిపల్లి గ్రామానికి చెందిన పంబల దుర్గయ్యకు రూ.10 వేలు, కాలేరు లతరాణికి రూ.60వేలు, గోల్పల అనితకు రూ.35వేల విలువచేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ డీసీఎంఎస్ వైస్ చైర్మన్ గల్వ ఇంద్రసేనారెడ్డి, నాగేశ్వరరావు, సంగమేశ్వర్, సతీష్, నర్సాగౌడ్, నాగరాజు, గొల్పల శేఖరయ్య, సంగమల్లు నారాయణలు బాధిత కుటుంబాలకు అందజేశారు.

## భక్తులకు భద్రాది రాముల కళ్యాణ తలంబ్రాలు

**రామచంద్రాపురం, మార్చి 24, ప్రభాతవార్త:** భద్రాది సీతారాముల కళ్యాణ తలంబ్రాలను భక్తులకు చేర్చేందుకు టిఎస్ ఆర్టీసి నిర్ణయం తీసుకుందని బిహెచ్ఈఎల్ డిపో మేనేజర్ సుధాకర్‌రావు తెలిపారు. శుక్రవారం మేనేజర్ సుధాకర్‌రావు మాట్లాడుతూ రాముల వారి తలంబ్రాలను గత సంవత్సరం మాదిరిగా భక్తులకు అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. తలంబ్రాలు కావాలనుకునే భక్తులు 116 రూపాలయను చెల్లించి రశీదును అందుకోవాలన్నారు. టిఎస్ ఆర్టీసి వారు నేరుగా తాము సూచించిన అడ్రస్‌కు సీతారాముల వారి తలంబ్రాలు ఇంటికి చేరుతాయన్నారు. తలంబ్రాలతో పాటు రెండు ముత్యపు తలంబ్రాలు సైతం ఉంటాయన్నారు. తలంబ్రాలు కొరకు బిహెచ్ఈఎల్ డిపో మేనేజర్‌కు కాని, సమీపంలో గల కార్గోవద్ద కాని 116 రూపాయలను చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 9959226149 లేదా 9000757567లను సంప్రదించాలన్నారు.

## పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి

### -బిజెపి రాష్ట్ర నాయకులు గోదావరి అంజిరెడ్డి



మాట్లాడుతున్న గోదావరి అంజిరెడ్డి

**రామచంద్రాపురం, మార్చి 24, ప్రభాతవార్త:** టీఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజిపై సిట్టింగ్ జడ్జితో విచారం చేయించాలని బిజెపి నేత గోదావరి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గోదావరి అంజిరెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ పేపర్ లేకజి విషయంలో మంత్రి కల్వకుంట్ల తారక రామారావును వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షలు రాసిన అభ్యర్థులకు 1 లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు మల్లేష్, కృష్ణ, రాములు యాదవ్, బాస్కర్, బాబ్జి, రవి, నరసింహా, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిపై అవగాహన తప్పనిసరి

**చిన్నశంకరంపేట,మార్చి 24, ప్రభాతవార్త:** గ్రామంలోని ప్రతి ఒక్కరు క్షయవ్యాదిపై అవగాహన కలిగి ఉండాలని చందాపూర్ గ్రామ సర్పంచి రమాదేవి తెలిపారు. శుక్రవారం విద్యార్థులచే క్షయ వ్యాదిపై ర్యాలీ నిర్వహిస్తూ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం యాదమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జహిరోద్దిన్, స్వప్న,శోభరాణిలు పాల్గొన్నారు.



చందాపూర్‌లో క్షయ వ్యాధిపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

# ప్రగతికి ప్రతీకలు పటాన్‌చెరు పల్లెలు : ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, మార్చి 24 ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ వ్యవస్థలో సిఎం కేసీఆర్ తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల మూలంగా ప్రతి గ్రామం అభివృద్ధికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పండిట్ దీన్ దయాల్ సతత్ పంచాయతీ పురస్కారాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రతి సంవత్సరం 9 అంశాల్లో గ్రామ పంచాయతీలకు అందిస్తున్న ఉత్తమ అవార్డుల్లో తెలంగాణ రాష్ట్రంలోని అత్యధిక గ్రామ పంచాయతీలకు అవార్డులు రావడం సంతోషకరమన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పల్లెప్రగతి కార్యక్రమం గ్రామాల రూపురేఖలు మారుస్తుందన్నారు. ప్రతి నర్ణయం ప్రజల ఆమోదం మేరకు తీసుకోవడంతోపాటు పూర్తిపారదర్శకతతో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రతిపైసాను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను వంద శాతం సద్వినియోగం చేసుకొని పటాన్‌చెరు నియోజకవర్గం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని సంతోషం వ్యక్తం చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని 55 గ్రామ పంచాయితీలలో 40 గ్రామ పంచాయితీలకు సొంత నిధులతో ట్రాక్టర్లు పంపిణీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. పలుచోట్ల జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో గ్రామ పంచాయితీ భవనాలను సైతం నిర్మించడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో దేశంలోనే ఉత్తమ గ్రామ పంచాయితీలుగా అవార్డు గెలుసుచుకునేలా కృషిచేయాలని కోరారు.




పంచాయతీ పురస్కారాలనను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## రాహుల్ గాంధీపై అనర్హత వేటు అప్రజాస్వామికం

### -టిపిసిసి నేత వై నరోత్తం

**జహీరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి వాక్ స్వాతంత్ర్యం ఉందని టిపిసిసి నేత వై నరోత్తం అన్నారు. ప్రజల సొమ్మును దోచుకున్న నిరవ్‌మోడీ, లలిత్‌మోడిలను దొంగలు అని ఉచ్చరించిన రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం అప్రజాస్వామికం కాదా అని నరోత్తం ప్రశ్నించారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నరోత్తం మాట్లాడుతూ వాస్తవాలు మాట్లాడిన రాహుల్ గాంధీని మెచ్చుకోకుండా పార్లమెంట్ సభ్యత్వానికి అనర్హత వేటు వేయడం సరికాదన్నారు. కోర్టు 30 రోజుల పాటు గడువు ఇచ్చినా అంత వరకు ఆగకుండా ఆగమేఘాల మీద రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేదయం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

## శ్రీరేణుక ఎల్లమ్మ జాతర.. పాల్గొన్న బిజెపి నేతలు



జాతర ఉత్సవాల్లో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ నాయకులు రఘువీరారెడ్డి

**కొల్చారం, మార్చి 24 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర మహోత్సవంలో భాగంగా శుక్రవారం శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకులు రఘువీరారెడ్డి పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర మహోత్సవాల కోసం స్థానిక సర్పంచి మాధవి శ్రీశైలంకు 5 వేల రూపాయల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొల్చారం, కౌడిపల్లి మండలాల బీజేపీ అధ్యక్షులు పాతూరి దయాకర్‌గౌడ్, ఖాజిపేట రాకేష్, బూత్ అధ్యక్షులు కృష్ణ, సతీష్, శేఖర్, అరవింద్, మండల మైనార్టీ మోర్చా అధ్యక్షులు కలీల్, గ్రామ పెద్దలు అయిలి రాములు, ఆంజనేయులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ




క్షయ వ్యాధి నిర్మూలపై నిర్వహిస్తున్న ర్యాలీ

**పెద్దశంకరంపేట, మార్చి24 ప్రభాతవార్త:** ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వికాస్ మాట్లాడుతూ 2025 నాటికి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని ప్రభుత్వం పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ వ్యాధిని తొందరగా గుర్తించడం ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందకుండా చేయవచ్చన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు ఉచితంగా అందజేయబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పల్లె ప్రగతితోనే గ్రామాల సర్వతోముఖాభివృద్ధి : ఎంపిపి



ఉత్తమ పంచాయితీ పురస్కారాలు అందుకున్న ప్రజాప్రతినిధులు

**పెద్దశంకరంపేట, మార్చి24 ప్రభాతవార్త:** సిఎం కేసీఆర్ చేపట్టిన పల్లె ప్రగతి పథకంతోనే గ్రామాల రూపురేఖలు సమగ్రంగా మారిపోయాయని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. జాతీయ ఉత్తమపంచాయతీ పురస్కారాలకు ఎంపికైన గ్రామాలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మండలంలో 27 గ్రామపంచాయతీలకుగా 20 పంచాయతీలు ఈ అవార్డులకు ఎంపికయ్యాయి. ఎంపికైన గ్రామాల సర్పంచులకు, ఎంపీ టీసీలకు, పంచాయతీకార్యదర్శులకు పూలమాలలు, శాలువాలతో సన్మానించి ప్రశంసా పత్రాలను ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీడీవో రఫీక్ ఉన్నీసా చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 10 విద్యార్థులకు పరీక్ష కిట్‌ల పంపిణీ

**పాపన్నపేట, మార్చి 24, ప్రభాతవార్త:** మండలంలోని పొడిచన్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష కిట్ (పరీక్ష ప్యాడ్, పెన్నులు, పెన్సిళ్లు, హాల్ టికెట్ ఫౌచ్)లను అందచేశారు. ఈ సందర్బంగా ప్రధానోపాధ్యాయులు కిషన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను ఆర్జిస్తే ఉన్నతులుగా ఎదగడం తథ్యమన్నారు. పరీక్షకిట్‌లను అందచేసిన పాఠశాల పూర్వ విద్యార్థి నారాయణ సంతోషరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలా ఈ మారు సైతం 10వ తరగతిలో మొదటి మూడుస్థానాలు ఆక్రమించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిషన్, ఉపాధ్యాయులు టీ మోహన్‌రావు, గ్రామ యువకులు సతీష్, బి సతీస్‌రెడ్డి, నారాయణ, వెంకట్‌రెడ్డి, దుర్గారెడ్డి తదితరులు ఉన్నారు.




కేసు వివరాలు తెలుపుతున్న ఎస్ఐ శ్రీకాంత్

## దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

**జహీరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** ఓ వ్యక్తిపై దాడిచేసి గాయపర్చిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కె శ్రీకాంత్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... ఈ నెల 22న రాత్రి 7.30 గంటల ప్రాంతంలో జహీరాబాద్‌లోని శాంతినగర్‌కు చెందిన దానం నర్సింహారెడ్డి (23), బాగారెడ్డిపల్లికి చెందిన సంపంగి వేణు(22)లు ద్విచక్ర వాహనానికి వాటర్ వాషింగ్ చేయాలని శ్రీదత్త ఫోమ్ వాషింగ్ సెంటర్‌కు వెళ్లారు. అప్పటికే వాషింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న వ్యక్తి కారును వాషింగ్ చేస్తుండటంతో కారు పనిఅయిపోగానే ద్విచక్ర వాహనానికి చేస్తానని పేర్కొన్నా తమకే ఆగమంటావా అంటూ సెంటర్ నిర్వాహకుడు నాగరాజును చెక్కముక్కలతో కొటి గాయపర్చారన్నారు. బాధితుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బాధ్యులు ఇరువురిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ వివరించారు.

## షాట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం..1లక్ష ఆస్తి నష్టం

**పాపన్నపేట, మార్చి 24, ప్రభాతవార్త:** విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో ఇంట్లోని నగదు కాలిపోయిన సంఘటన మండల పరిధిలోని నాగనాస్‌పల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ఎర్ర సాకలి సాయిలు తమ సోదరుడి కూతరు వివాహానికి అవసరమైన వస్తువులు, బట్టలు, 50వేల రూపాయల నగదును ఇంట్లో బధ్రపర్చుకున్నారు. శుక్రవారం ఇంట్లో షాట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంబవించగా దాచుకున్న 50వేల నగదుతో పాటు వస్తువులు కాలిపోయాయన్నారు. ఇంట్లో మంటలు వస్తుండటాన్ని గమనించి పక్కవారు విషయాన్ని ఇంటి వారికి తెలుపగా వెంటనే విద్యుత్‌ను ఆర్పేసి ఇంట్లో పరిశీలించగా నగదుతో పాటు వస్తువులు కాలిపోయినట్లు గుర్తించారు.